క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప జన్మదిన వేడుకలు



రెంటచింతల: గ్రామంలోని స్థానిక శివాలయం ఆవరణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో, పాలువాయి గేటు గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ, నందిగామ శ్రీనివాస్‌శర్మ నేతృత్వంలో అయ్యప్పస్వామి వారిని అలంకరించి వేకువ జామున 5 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. పాలకమండలి సభ్యులు వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంచికల్లు గ్రామం సత్రంసెంటర్లో అయప్ప స్వామి విగ్రహం ఏర్పాటుచేసి అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పలు రకాల అభిషేకాలు నిర్వహించారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు సుధాకర్

మాచర్ల రూరల్: మిద్దె పైకి ఎక్కి నిద్రిస్తుండగా కింద పడి ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మాచర్లలో జరిగింది. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో నివాసముంటున్న గెలిపోగు సుధాకర్ (40) అనే వ్యక్తి మార్చి 31వ తేదీన దాబా పైకి ఎక్కి నిద్రిస్తూ నిద్రమత్తులో కింద పడ్డాడు. గాయాలపాలైన సుధాకర్‌ను కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మృతుని భార్య రత్నకుమారి తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారెంపూడి మాజీ ఉప సర్పంచ్ మృతి



వీర బ్రహ్మం (ఫైల్)

కారెంపూడి: కారెంపూడి గ్రామ మాజీ ఉప సర్పంచ్ బొమ్మిన వీర బ్రహ్మం (49) ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. రాత్రి 8 గంటల సమయంలో గుండె పోటు రావడంతో పిడుగురాళ్ల హాస్పటల్‌కు తరలించే లోగానే ఆయన మృతి చెందారు. 2014 నుంచి 2019 వరకు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా వీర బ్రహ్మం సేవలందించారు. అంతకు ముందు ట్యూషన్ మాస్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం శ్రీచక్ర సిమెంట్స్‌లో ఉద్యోగిగా ఆయన పని చేస్తున్నారు. వీర బ్రహ్మం మృతిపై పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

విద్యార్థినికి అభినందనలు

మాచర్ల రూరల్: అకుంఠిత దీక్షా పట్టుదలతో ఘన విజయం సాధించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మాచర్ల పట్టణానికి చెందిన తిరివీధి పూజితా ప్రీతి ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించిన విషయం విధితమే. ఈ సందర్భంగా విద్యార్థినితో కలిసి విద్యార్థిని తండ్రి వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు సోమవారం మున్సిపల్ చైర్మన్ నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన పూజితా ప్రీతి గుంటూరు మాస్టర్ మైండ్స్‌లో చదువుతూ ఇంటర్ ఎంఈసీ ఫస్టియర్‌లో 500 మార్కులకు 488 సాధించి రాష్ట్ర స్థాయిలో 7వ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, సేవా సంఘం నాయకులు పలువురు విద్యార్థినిని అభినందించారు.

జ్ఞాన ఫలాన్నిచ్చే జ్ఞాన ప్రసూనాంబ

పాలువాయి(రెంటచింతల): జ్ఞాన ఫలాన్నిచ్చే జ్ఞాన ప్రసూనాంబ దేవి అమ్మవారు అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాలువాయి గ్రామంలో వేంచేసియున్న అతి పురాతనమైన జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో రామరాజు చంద్రశేఖరరావు, గ్రామ పెద్దలు నూతనంగా నిర్మిస్తున్న శ్రీ జ్ఞాన ప్రసున్నాంబిక అమ్మవారి ఆలయ భూమిపూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వేద పండితులు జిగురు ప్రసాద్ శర్మ నేతృత్వంలో శంకుస్థాపన క్రతువును నిర్వహించారు. తొలుత దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ శౌంఠిరెడ్డి నాగమ్మ నర్సిరెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న అంబేడ్కర్ ప్రపంచ మేధావి

- రాష్ట్రంలో రాజ్యాంగ విరుద్ధ పాలన
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి
- భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఘననివాళులు
- వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: ప్రపంచం గర్వించే మహనీయుడు, మహామేధావి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వం నడిచిందని, కానీ నేడు కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని టీడీపీ వాళ్లే గర్వంగా చెప్పుకుంటున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను అందరూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ, టీడీపీ కూటమి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. దానికి ఉదాహరణే దేశంలోని ముస్లింలందరూ వ్యతిరేకిస్తున్నా.. వక్ఫ్ సవరణ చట్టం చేయడమేనన్నారు. దానికి రాష్ట్రంలోని కూటమి పార్టీలైన టీడీపీ, జనసేనలు వంతపాడడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్ సీపీ పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని వ్యతిరేకించిందని గుర్తు చేశారు. పల్నాడు జిల్లాలో ఎంపీ కానీ, ఎమ్మెల్యేలు కానీ ప్రజలను పట్టించుకోవటం లేదని, వారికి తెలిసింది.. దోచుకోవటం, దాచుకోవటమేనన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాలులర్పించారు. వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పట్టణ, మండల కన్వీనర్‌లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, యూత్ కన్వీనర్ మందా సుధీర్, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు మాజీ సీఎం వైఎస్ జగన్ కృషి

మాచర్ల రూరల్: ప్రపంచ దేశాలు కీర్తించే మేధావిగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఖ్యాతి గడించారని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాచర్ల సుందరరావు, జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారు మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత కీర్తి ప్రతిష్టలు ప్రపంచ దేశాలకు తెలిసేలా రాష్ట్ర నడిబొడ్డున విజయవాడలో దేశంలోనే అతి పెద్ద 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. అట్టడుగు వర్గాల అభ్యుదయం కోసం రాజ్యాంగాన్ని నిర్మించి దేశ ప్రజల అభివృద్ధిలో భాగస్వామ్యమైన అంబేడ్కర్ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలిసేలా ప్రపంచంలోనే అతి ఎత్తయిన 206 అడుగుల విగ్రహాన్ని 19 ఎకరాల్లో రూ.400 కోట్లతో స్థాపించి, భావి తరాలకు జగనన్న మార్గదర్శి అయ్యారన్నారు. కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బూదాల మరియమ్మ, కౌన్సిలర్‌లు మందా సంతోష్, వేల్పుల గురవయ్య, కందుకూరి మధు, కోటా రాజేష్, యలకపాటి రమేష్, కొమ్ము బొంగురు, సాగర్ తదితరులున్నారు.

- తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, వీఆర్‌ఓ జలీల్, శ్రీనివాసరావు, అచ్చయ్య తదితరులున్నారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన ప్రజలందరూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వలన ఎంతో లబ్ధి పొందారని మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆదర్శనీయుడు డాక్టర్ అంబేడ్కర్

మాచవరం: భరతజాతి గర్వించదగిన ప్రపంచ మహామేధావి డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఆదర్శనీయుడని పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దారా చెన్నయ్య అన్నారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను, మాచవరం ఎస్సీ కాలనీ, మండపాల సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామంటూ నినాదాలతో, డీజెలతో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళిత యూత్ సభ్యులు, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అంబేడ్కర్ అభిమానులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం

దాచేపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాదిద్దామని ఎంపీపీ కందుల జాను అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాచేపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు జరిపారు. ఎంపీపీ జాను మాట్లాడుతూ.. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారని, రాజ్యాంగం ద్వారానే మన అందరికీ సమానత్వం హక్కు లభించిందన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మండల కన్వీనర్ కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్ రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, నాయకులు దాచేపల్లి సైదారావు, షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్ కుమార్, పరిమి బాబు, షేక్ డాడీ, నాళం శ్రీనివాసరావు, గరిణే పుల్లారావు, వేముల శ్రీహరి, కొమ్మా కరుణకర్, కొత్రపాటి ఏర్రయ్య, బొల్లంపల్లి మరియదాసు, జంగాల సింగరయ్య యాదవ్, కుందురు తిరుపతిరెడ్డి, నట్టు శ్రీనివాసరావు, ఆవుల సైదులు తదితరులు పాల్గొన్నారు. పల్నాడు బలహీనవర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఇరికేపల్లిలోని ఎస్సీ కాలనీ జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఈఓపీఆర్డీ నాగెండ్ల రత్నం, స్థానికులు మాతంగి రాంబాబు, ఆనందరావు, పురుషోత్తం, నాగెండ్ల ఏసయ్య తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నడికుడిలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో మండలశాఖ అధ్యక్షుడు వేల్పుల మహేష్, కో-ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: సీపీఎం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లుట్ల రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు షేక్ బాబు, బిక్షాలు, మలవరపు రాఘవులు, కొమ్ము పుల్లయ్య, కనకయ్య, బిక్షం, కోట పేరయ్య, ప్రభాకరావు, మీసాల రాజు తదితరులు ఉన్నారు. పట్టణంలోని కేఎస్ఆర్ విద్యా సంస్థలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేఎస్ఆర్ డిగ్రీకాలేజీ డైరెక్టర్‌లు కోనేటి నరసిహారావు, బాడిస మస్తాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి పులిహోర పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పిల్లి చెన్నారావు, నెలటూరి బాలరాజు, పాశం శ్యామ్, దారా చెన్నయ్య, బత్తుల దాసు, కొమ్మ మోషే, మండే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని లెనిన్‌నగర్ లోని కార్ప్స్ సంస్థ స్కూల్ నందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్, అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు అబ్రహం, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్.నాగేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం లత, దయామణి, పుష్పలత, రహీమ్ తదితరులు ఉన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ అంబేడ్కర్

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



పాలువాయిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: అట్టడుగు వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాలువాయి గ్రామంలోని ఆయన పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలోని ప్రజల మధ్యనున్న అసమానతలు, కులదురహంకారంపై అలుపెరుగని పోరాటం చేసిన మహాయోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. స్థానిక నాయుడుపేట ఎస్సీ కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ మండల కార్యదర్శి కె.రంగనాయకులు, బీజేపీ మండల అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి, ఎంఎస్‌పీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు, మాచర్ల నియోజకవర్గ ఇంచార్జి గడ్డిపర్తి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక బస్‌స్టాండ్ సెంటర్లో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్టీయూ రెంటచింతల శాఖ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయపురిసౌత్: కులాలకు, మతాలకు అతీతంగా అంబేడ్కర్‌ను స్మరించుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ కమిటీ చైర్మన్, కాంట్రాక్టర్ లక్ష్మయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి, ఏఈ నర్సింహమూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్క్, మీసాల వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ మండ్లి మల్లుస్వామి



మాచర్లలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేస్తున్న దృశ్యం



మాచవరంలో నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

చెన్నుని దేవాలయంలో అఖండ జ్యోతి

గత తొమ్మిది దశాబ్దాలుగా దేదీప్యమానంగా వెలుగుతున్న వైనం



9 దశాబ్దాలుగా వెలుగుతున్న అఖండ జ్యోతి



విద్యుత్ అలంకరణలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం

మాచర్ల రూరల్: పల్నాటి ప్రజల ఆరాధ్య దైవం శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి వారి దేవాలయంలో 9 దశాబ్దాలుగా అఖండ జ్యోతి వెలుగుతుంది. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి అతి పురాతన దేవాలయం, క్రీ.శ.11వ శతాబ్దంలో కార్తవీర్యార్జుని వంశీకులు చెన్నకేశవాలయాన్ని నిర్మించారు. అప్పట్లో స్వామి వారి గర్భగుడిలో దీపారాధనలో భాగంగా జ్యోతిని వెలిగించారు. అప్పటి నుంచి వెలుగుతున్న జ్యోతిని హైహయ వంశీకుల్లో ఒకరైన సాగిపేట అనుగురాజు పునర్నిర్మించి, దేవాలయాన్ని అభివృద్ధి చేస్తూనే వారసత్వంగా అఖండ జ్యోతి ప్రాధాన్యం కాపాడారు. గర్భగుడిలో ఎవరికీ కనిపించకుండా స్వామివారికి ఎడమ వైపు ద్వారం వెనుక భాగంలో ఈ జ్యోతి ఉంటుంది. బ్రహ్మానాయుడు కాలం నుంచి ఈ అఖండ జ్యోతి వెలుగుతూనే ఉంటుంది. లోపల పూజలు నిర్వహించే అర్చకులు అఖండ జ్యోతిని కంటికి రెప్పలా చూస్తుంటారు. ఎంతో పవిత్రమైన ఈ జ్యోతికి నూనె మార్చడంతో పాటు అవసరమైన దూదితో ఒత్తులు ఏర్పాటు చేస్తారు. వందల సంవత్సరాలుగా వెలుగుతున్న ఈ అఖండ జ్యోతి ఎంతో శుభసూచకం అని ఆలయ ప్రధాన అర్చకుడు రాజగోపాలాచార్యులు, ఈఓ ఎం.పూర్ణచంద్రరావు తెలిపారు.

అగ్నిమాపక భద్రతా వారోత్సవాలు



వారోత్సవాలలో పాల్గొన్న ఫైర్ ఆఫీసర్ సునీల్, సిబ్బంది, విద్యార్థులు

మాచర్ల రూరల్: 1944 ఏప్రిల్ 14వ తేదీన బొంబాయిలో గన్‌పౌడర్ ఫైర్ యాక్సిడెంట్‌లో జరిగిన పరిణామానికి గుర్తుగా దేశవ్యాప్తంగా ఏప్రిల్ 14వ తేదీని అగ్నిమాపక అమరవీరుల దినోత్సవంగా జరుపుకొంటామని ఫైర్ ఆఫీసర్ కె.సునీల్ కుమార్ తెలిపారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సునీల్ కుమార్ మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20 వతేదీ వరకు అగ్నిమాపక భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గృహ యజమానులు, ఆసుపత్రులు, స్కూల్స్, అపార్ట్‌మెంట్స్ వాసులు తీసుకోవాల్సిన చర్యల పై ఆయన అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది అన్నవరపు వెంకటేశ్వర్లు, మార్బూరి లక్ష్మయ్య, వి.శివ ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, అప్పలనాయుడు, బాలకృష్ణ, అంజనేయులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని మార్కెట్ యార్డులోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలల్లో మొదటి రోజు సోమవారం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆర్టీసీ డీఎం కోటేశ్వరనాయక్, ఏఎంఎఫ్ ఎ.రాజా, డాక్టర్ వి.శ్రీనివాసరావు, డాక్టర్ మూర్తి, వై.సాంబశివరావు, స్కాలర్స్ ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఎంట్రన్స్ దరఖాస్తుకు నేటితో ముగుస్తున్న గడువు

క్రోసూరు: ఈనెల 30వ తేదీ జరగనున్న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలకు (2025-26) దరఖాస్తు చేసుకొనేందుకు గడువు (ఈనెల 15 వతేదీ) మంగళవారంతో ముగుస్తుందని క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్స్‌పాల్ బి.వి. రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి రాసిన, ఉత్తీర్ణులైన విద్యార్థులంతా http://poycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు రూ.100, ఇతరులు రూ.400 చెల్లించాలని, వివరాలకు 9494840838, 944061300 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు దేవాలయ భూముల కౌలు హక్కుల వేలం

రెంటచింతల: రెంటచింతలలోని వేణుగోపాల స్వామి దేవస్థానం భూముల కౌలు హక్కులకు మంగళవారం బహిరంగ వేలం స్థానిక శివాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న బహిరంగ వేలం పాటలో పాల్గొన్న వారికి 2025-2026 నుంచి 2027-2028 వరకు 3సంవత్సరాలపాటు కౌలు హక్కును పొందటం జరుగుతుందన్నారు. 18.88 ఎకరాల మాగాణి భూములకు, 14.73 ఎకరాల మెట్టభూమికి జరిగే ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ. 5 వేలు ప్రథమ ధరావత్తులు చెల్లించి పాల్గొనాలని కోరారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలాఖరులో చెల్లించి భూమిలో ప్రవేశించాల్సి ఉంటుంద న్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

జంక్ ఫుడ్‌తో గ్యాస్ట్రిక్ సమస్యలు

నకరికల్లు: జంక్‌ఫుడ్‌లు, మితిమీరిన ఆహారపు అలవాట్ల వల్ల గ్యాస్ సంబంధిత సమస్యలు అధికమయ్యాయని డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ తెలిపారు. నరసరావుపేటలోని బసవన్న గ్యాస్ట్రో అండ్ లివర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మండలంలోని చల్లగుండ్లలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సాయిజనని హాస్పిటల్ అధినేత, ప్రముఖ గుండె వైద్యనిపుణులు మేడికొండ పరమేశ్వరరెడ్డి ప్రారంభించారు. పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సాగి శ్రీనివాసరావు, నాదెండ్ల వీరయ్య, వెంకటరెడ్డి, హనిమిరెడ్డి పాల్గొన్నారు.


రాజ్యాంగంపై దాడిని ఐకమత్యంతో ఎదుర్కోవాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

సత్తెనపల్లి: ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై జరుగుతున్న ముప్పేట దాడిని అభ్యుదయ భావ జాలం కలిగిన నాయకులు, మేధావులు ఐకమత్యంతో సమర్థంగా ఎదుర్కోవాలని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, న్యాయవాదులు, ప్రజా సంఘ వాదులు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం- ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశం పై న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వ్యక్తలు మాట్లాడారు. దేశంలో ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, సాంకేతిక రంగాలన్నిటిలో సమానతను సాధించుకోవడమే రాజ్యాంగ లక్ష్యమని తెలిపారు. అయితే కొంతమంది పాలకులు, కార్పొరేట్, మనువాదుల విధానాల వల్ల ఆ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఆర్టికల్ 1, 3, 14, 17, 25, 39.. ఇలా అన్నీ హక్కులు కాలరాస్తున్నారని పేర్కొన్నారు. జమిలి ఎన్నికలు, నియోజకవర్గాల డీ లిమిటేషన్‌తో రాజ్యాంగానికి, ప్రజలకు మరింత ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, న్యాయవాదులు చిలుకా చంద్రశేఖర్, దాసరి జ్ఞానరాజ్ పాల్, సయ్యద్ అబ్దుల్ రహీం, అంకాళ్ల వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, సూరే వీరయ్య, ఎం. ఏడుకొండలు, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు డి.విమల, పెండ్యాల మహేష్, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి కంబాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్దెల మోహన్, జెట్టి శేఖర్ పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

సత్తెనపల్లి: వీఆర్ఏలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, బెత్తెడు జీతంతో బండ చాకిరీ చేయిస్తున్నారని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు రవి అన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అంబేడ్కర్ సాక్షిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా వీఆర్ఏల సమస్య ఒక్కటీ పరిష్కారం కాలేదని తెలిపారు. పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో పేస్కేల్ అమలు చేయాలని మంత్రులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నా కనికరించడం లేదని తెలిపారు. చదువుకున్న వీఆర్ఏలు ప్రమోషన్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మన్ ప్రమోషన్లు 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి రమాదేవికి నేషనల్ సింహ అవార్డు ప్రదానం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి నేషనల్ సింహ అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్-2025 హైదరాబాద్ రవీంద్ర భారతి హాల్లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి రమాదేవికి అవార్డు ప్రదానం చేసి మెమెంటో, సర్టిఫికెట్ అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రమాదేవిని పట్టణంలోని వివిధ సంస్థల అధినేతలు, కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.